మంచు దుప్పటి..!



జిల్లాలోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు పొగ మంచు దట్టంగా కమ్ముకుంటోంది. సూర్యుడు ఉదయించినా వాహనదారులు దీపాల వెలుగులో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అండర్‌పాస్ వంతెనల వద్ద మరింత ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారిపై కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు వంతెన వద్ద శుక్రవారం ఉదయం 7:30 గంటల సమయంలో దట్టంగా మంచు కురుస్తున్నప్పుడు తీసిన చిత్రమిది.
– న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు (కోటబొమ్మాళి)

కొత్తమ్మతల్లి జాతర ఆదాయం రూ.18.21 లక్షలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి జాతర సందర్భంగా సమకూరిన ఆదాయాన్ని శుక్రవారం ఆలయ సిబ్బంది, భక్తులు లెక్కించారు. హుండీల ద్వారా రూ.14 లక్షలు, కానుకల రూపంలో రూ.2.33 లక్షలు, ప్రత్యేక దర్శనాల ద్వారా 1.87 లక్షలు వచ్చిందని అధికారులు తెలిపారు. గతేడాది రూ.20.12 లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.18.21 లక్షలు వచ్చిందని చెప్పారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, సీఎఫ్‌వో భద్రాజీ, ఈవో రాధాకృష్ణ, బోయిన రమేష్, వెంకప్ప, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కార్యశాల నిర్వహించారు.



మాట్లాడుతున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

- వికసిత్ ఆంధ్రప్రదేశ్-స్వర్ణాంధ్ర 2047పై ఇప్పటి వరకు 1.24 లక్షల మంది నుంచి స్పందన వచ్చిందని.. అభిప్రాయ సేకరణలో జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సంపద సృష్టి, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న జలవనరుల ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. సౌర విద్యుదుత్పత్తిని పెంచాలన్నారు. పొందూరులో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు 500 ఎకరాలు అవసరమని తెలిపారు.
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల అభివృద్ధి, మినీ జెట్టీలు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
- సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడారు. సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీపీవో లక్ష్మీప్రసన్న, డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ రాంజేంద్రప్రసాద్, డీఈవో తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వెనుకబడిన జిల్లాగా ఉన్న పేరును తొలగించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పని చేయాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖలు సాంకేతికతను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలి. జిల్లాలోని తీర ప్రాంతం పామాయిల్ సాగుకు అనుకూలం. బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం. మూలపేట పోర్టుకు వచ్చే ఏడాది జూన్ నాటికి ఓడ వచ్చేలా లక్ష్యం పెట్టుకున్నాం. భోగాపురం నుంచి మూలపేటకు పోర్టుకు రహదారి నిర్మిస్తే తీరప్రాంతం అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి భూసేకరణకు సన్నాహాలు జరుగుతున్నాయి. పలాస, మరికొన్ని కేంద్రాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా. రాష్ట్రానికి వచ్చిన రిఫైనరీ కేంద్రాన్ని జిల్లాలో ఏర్పాటు చేస్తే రూపురేఖలు మారతాయి. టెంపుల్ టూరిజం పేరిట బస్సులు ఏర్పాటు చేస్తే జిల్లాలోని అన్ని దేవాలయాలు సందర్శించవచ్చు. బలరాంపురంలో ప్రభుత్వ భూమి వివరాలు డీఎఫ్‌వో తీసుకోవాలి. జిల్లా జైలు వద్ద క్రికెట్ మైదానం ఏర్పాటుకు భూమి పరిశీలించాలి' అని మంత్రి జేసీకి సూచించారు.


తెలిసినోళ్లే కీచకులు..!


కాస్త పరిచయంతో నయవంచన

బాలికలు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

ఎచ్చెర్ల, శ్రీకాకుళం నేరవార్తవిభాగం, న్యూస్‌టుడే

కాస్త పరిచయాన్ని ఆసరాగా చేసుకుని బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కొందరు అమాయకులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడి లొంగదీసుకుంటున్నారు. ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థినులే ఎక్కువగా బాధితులవుతున్నారు. ఉజ్వల భవిష్యత్తును చూడాల్సిన వారు బయటకు రాలేక ఇంటికే పరిమితమవుతున్నారు. కొన్ని ఉదంతాలు పోలీసుస్టేషన్ వరకు వెళ్లి కేసులు నమోదవుతుండగా మరికొన్ని వెలుగులోకి రావడం లేదు. తల్లిదండ్రులు చెడు, మంచి స్పర్శల మధ్య తేడాను వివరించి అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.





- ఎచ్చెర్ల మండలంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని అదే పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు గత నెలలో ఆమె భుజాన్ని తాకుతూ ఐ లవ్ యూ చెప్పాడు. ఈ విషయాన్ని తల్లి దండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. వారు పాఠశాలకు వచ్చి ప్రశ్నించడంతో అతను కావాలని చేయలేదని క్షమాపణ కోరాడు.

- సారవకోట మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమెతో ఉన్న పరిచయాన్ని ఆసరాగా చేసుకుని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గత నెల 16న మాయమాటలు చెప్పి ద్విచక్ర వాహనంపై భావనపాడు బీచ్‌కు తీసుకెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చిన బాలిక కడుపులో నొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది.

- ఎచ్చెర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు (ఇంటర్ విద్యార్థిని) అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో మూడు నెలల కిందట పరిచయమైంది. వివాహం చేసుకుంటానని చెప్పి శారీరకంగా దగ్గరయ్యాడు. ఆమె గర్భం దాల్చిన విషయం బయటకు పొక్కింది. అతను తనకు సంబంధం లేదని తప్పించుకోవడంతో ఆ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది.

- రణస్థలం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఆమెకు మాయమాటలు చెప్పి లొంగదీసుకోవడంతో గర్భం దాల్చింది. తనకు సంబంధం లేదని అతను చెప్పడంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

.. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. కొందరు పరిచయాన్ని ఆసరాగా తీసుకుని ప్రేమ పేరిట మాయమాటలు చెబుతున్నారు. నమ్మించి ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లి దారుణాలకు ఒడిగడుతున్నారు.

ఉపాధ్యాయులదే కీలక పాత్ర

లైంగిక దాడులకు గురవుతున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికలే ఎక్కువగా ఉంటున్నారు. ఉపాధ్యాయినులు చొరవ తీసుకుని సమాజంలో చోటుచేసుకుంటున్న దారుణ ఉదంతాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. ఇతరులు ఎక్కడ తాకితే ఎలా స్పందించాలో తెలియజేసి చైతన్యపరచాలి. అతిక్రమిస్తే తక్షణం వ్యతిరేకించే పద్ధతులను నేర్పాలి.

తల్లిదండ్రులు ఇలా చేస్తే మేలు

- అమ్మాయిలకు మంచి, చెడు స్పర్శ వంటి విషయాలపై అవగాహన కల్పించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- రోజూ పిల్లలతో కొంత సమయం మాట్లాడి వారి దినచర్య, ఎవరెవరితో మాట్లాడుతున్నారనే అంశాలు తెలుసుకుని అప్రమత్తం చేయాలి.
- ఎవరితోనైనా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే వారి గురించి ఇంట్లో చెప్పాలని సూచించాలి. చేదు అనుభవం ఎదురైతే నెమ్మదిగా సమస్య తెలుసుకుని పరిష్కరించాలి.

పిల్లలపై పర్యవేక్షణ అవసరం..



పిల్లలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. పాఠశాలల్లో నైతిక విలువలు నేర్పడం, నీతి కథలు బోధించడం, క్రీడల్లో భాగస్వాములను చేస్తే సత్ఫలితాలు ఉంటాయి. బాలికలపై అఘాయిత్యాలకు సంబంధించి సత్వరం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం.
– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం..



తల్లిదండ్రులు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు చదువుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ విధానం మారాలి. ఇంటి వద్ద తాత, అమ్మమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో పిల్లలు గడిపేలా తల్లిదండ్రులు చూడాలి. గంజాయి, మత్తు పదార్థాలు, పోర్న్ వీడియోలు దారుణాలకు కారణమవుతున్నాయి. వాటిని నియంత్రించి విలువలతో కూడిన విద్య, మానవ సంబంధాలను పెంపొందిస్తే అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడుతుంది.
– డా.జేఎల్ సంధ్యారాణి, మనస్తత్వ శాస్త్రం ఆచార్యులు, డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

దసరాకు కందిపప్పు..!

వైకాపా పాలనలో రేషన్ సరకుల పంపిణీ అస్తవ్యస్తం

వ్యవస్థను గాడిలోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం

కవిటి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే

నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. రేషన్ కార్డుదారులకు చౌక దుకాణాల ద్వారా దసరాకు కందిపప్పు, పంచదార సరఫరా చేయాలని నిర్ణయించింది. జిల్లాలో కొన్ని చౌక దుకాణాలకు సరకు చేరింది. మిగిలిన వాటికీ అందించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

వైకాపా ఐదేళ్ల పాలనలో ఏ నెలలోనూ కార్డుదారులకు పూర్తిస్థాయిలో సరకులు పంపిణీ చేయలేదు. అట్టహాసంగా ఎండీయూ వాహనాలను తీసుకొచ్చినా బియ్యం, అప్పుడప్పుడు గోధుమ పిండి పంపిణీకే పరిమితం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రతి కార్డుదారుకు కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందేలా చర్యలు తీసుకుంది.



కిలో రూ.67కే..

బహిరంగ విపణిలో కందిపప్పు ధర కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతోంది. రేషన్ కార్డుదారుల్లో అధిక శాతం పేదలే. వీరు కందిపప్పు కొనుగోలుకు ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నారు. పండగలు, ఉత్సవాల సమయంలో అవసరం మేరకు కొంటున్నారు. ఫలితంగా పోషకాహారం సరిగా అందని పరిస్థితి నెలకొంది. చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67కే అందజేస్తోంది. ఎక్కువ మంది కార్డుదారులు కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. ఈ నెల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు మేలు ..



వైకాపా హయాంలో ఏ నెలలోనూ సక్రమంగా సరకులు అందించలేదు. బియ్యం మాత్రమే ఇచ్చారు. రెండు నెలల నుంచి పంచదార అందుతోంది. ప్రస్తుతం కందిపప్పు ఇస్తున్నారు. పేదలు నిత్యావసర సరకుల కొనుగోలుకు ఇబ్బంది పడకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం.
– సుశీల సాహు, మాణిక్యపురం, కవిటి మండలం

అందరికీ అందజేస్తాం..

రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు అందజేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే కొన్ని మండలాలకు కందిపప్పు సరఫరా చేశాం. మిగిలిన ప్రాంతాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.
– జి.సూర్యప్రకాశరావు, డీఎస్‌వో, శ్రీకాకుళం

జిల్లాలో రేషన్ దుకాణాలు 1,625	ఎండీయూ వాహనాలు 422	మొత్తం కార్డులు 6,71,803	లబ్ధిదారులు 19,77,698	తెల్ల రేషన్ కార్డులు 6,35,471	లబ్ధిదారులు 18,80,952	అంత్యోదయ కార్డులు 36,332	లబ్ధిదారులు 96,746

7 నుంచి బీఆర్‌ఏయూకు సెలవులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు ఈ నెల 7 నుంచి 12 వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులకు ఈ సెలవులు వర్తిస్తాయని.. ఈ నెల 14న తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

9 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



డీఎంలతో మాట్లాడుతున్న డీపీటీవో విజయ్‌కుమార్

అరసవల్లి, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఈ నెల 9 నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం నాలుగు డిపోల మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కారణంగా 9 నుంచి విశాఖపట్నం బస్‌స్టేషన్‌లో జిల్లాకు చెందిన ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారు. ఆరోజు నుంచి ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా 60 బస్సులు నడుపుతాం. పగలు ప్రతి 5 నిమిషాలకు విశాఖ నుంచి జిల్లాకు బస్సులు అందుబాటులో ఉంటాయి. రాత్రి 9 గంటల తరువాత ప్రతి గంటకు పలాస, ఇచ్ఛాపురం వైపు వెళ్లడానికి నడుపుతాం. రైళ్లలో వచ్చే వారి రద్దీ మేరకు సర్వీసులు ఏర్పాటు చేస్తాం. ప్రయాణికుల డిమాండ్ మేరకు జిల్లా నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం, అమలాపురం తదితర ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తాం. ఈ నెల 10న హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం, పలాస, 11న శ్రీకాకుళం, టెక్కలికి ఒక్కో బస్సు చొప్పున నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలు వసూలు చేస్తాం' అని స్పష్టం చేశారు.

వైద్య విద్యలో పతకాల పంట

● బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ సహా 12 పురస్కారాలు అందుకున్న కాశీబుగ్గ యువతి



బెస్ట్ అవుట్ గోయింగ్ అవార్డును ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు నుంచి అందుకుంటున్న డాక్టర్ హిమాని

తల్లిదండ్రులే స్ఫూర్తి.. నాన్న నటరాజు మత్తు వైద్య నిపుణుడిగా, తల్లి మంజుల ప్రసూతి వైద్య నిపుణురాలిగా సేవలందిస్తున్నారు. వారే నాకు స్ఫూర్తి. వారి ప్రోత్సాహంతోనే ఇన్ని అవార్డులు లభించాయి. జనరల్ మెడిసిన్ చదివి సూపర్‌స్పెషాలిటీ వైద్య నిపుణురాలిగా స్థిరపడాలని ఉంది.
– డాక్టర్ హిమాని

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ ఎన్.హిమాని బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డుతో సహా వివిధ విభాగాల నుంచి 12 వరకు పతకాలు సొంతం చేసుకుని ఉత్తమ విద్యార్థినిగా నిలిచారు. 250 మంది చదువుతున్న ఏఎంసీలో ఇన్ని అవార్డులు ఒకే విద్యార్థినికి దక్కడం అరుదైన విషయమేనని ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. 2019 బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కళాశాల దినోత్సవంలో హిమానికి ప్రిన్సిపల్ అవార్డులు అందజేశారు. కాశీబుగ్గకు చెందిన వైద్య దంపతులు ఎన్.నటరాజు, ఎం.మంజుల దంపతుల కుమార్తె హిమాని నీట్‌లో 91వ ర్యాంకు సాధించి ఏఎంసీలో ఎంబీబీఎస్ కోర్సు చదివారు.

అనేక విభాగాల్లో..

మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఆప్తమాలజీ, ఎస్‌పీఎం, క్లీనికల్ సర్జరీ, పీడియాట్రిక్స్, క్లినికల్ న్యూరాలజీ విభాగాలకు సంబంధించి డాక్టర్ రాజారావు, డాక్టర్ భాస్కర్ మీనన్, డాక్టర్ శోభనాద్రి ఆచారి, మాధవరావు, డాక్టర్ వల్లభరావు, జైపూర్ విక్రమ్‌దేవ్‌వర్మ, డాక్టర్ భోగరాజు రామ్మూర్తి, సజ్జ చంద్రమౌళి పేర్లతో ఉన్న అవార్డులు ఆమెకు దక్కాయి. సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్ కమిటీ, ఆండ్రసన్ మెడల్ లభించాయి. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో పాల్గొని పురస్కారాలు దక్కించుకున్నారు. డాక్టర్ కల్యాణ్‌బాబు, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ పీబీఎస్ఎన్‌రాజు, డాక్టర్ కల్యాణమ్మ సీతమ్మ, డాక్టర్ రాజకిషోరి భాటియా స్మారక అవార్డులూ లభించాయి.







(c) eenadu

ఆశా కార్యకర్తల ధర్నా



తమ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని ఆశా కార్యకర్తలు శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఆపాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు రూ.4 వేలు వేతనం ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని.. వారిని ఆశాలుగా గుర్తించి సమాన వేతనం అందజేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో మీనాక్షి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

తపాలా ఉద్యోగుల నిరసన



ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు, ఆన్‌లైన్ శిక్షణ కోర్సుల పేరుతో ఉద్యోగులను వేధించడం తగదని జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య (ఎన్ఎఫ్‌పీఈ), అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) జిల్లా నాయకులు గణపతి, బాబూరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా తపాలా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు పోస్టు కార్డులు పంపారు. జిల్లా నాయకుడు నందికేశ్వరులు, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

జయహో జగన్మాత..!



జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు, దేవీ పీఠాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. పలు చోట్ల ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో శుక్రవారం అమ్మవారి విగ్రహాలకు పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శ్రీకాకుళం నగరం బలగలోని కాలభైరవాలయంలో సువాసిని పూజలు చేశారు. అదే ఈ చిత్రం. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

PUBLIC NOTICE

Public are hereby informed that my client **Smt.Peddina Chandrakala D/o Baratam Apparao, W/o Tirumala Rao**, r/at Karlemma Village, Official Colony, Kotturu Mandalam, Kotturu Post, Srikakulam District, she got the Schedule property through Registered Settlement Deed No.1766/2017, dt. 23-11-2017, the link document for the schedule property is Registered Sale Deed No. 3273/2022, in the travelling at Kotturu Centre unfortunately she lost the link document Original Registered Sale Deed No.23/2005, dt. 12-01-2005 and the same is not deposited elsewhere. Hence if anybody has found the document shall come forward within 7 days from this date.

Schedule: The Slabbed House is covered in Sy.No.195-2, Door No.5-436, is situated at Srikakulam District, Hiramandalam Sub-Division, Kotturu Mandalam, Karlemma Panchayathi, Karlemma Village, measuring East-West 30 feet or 9.15 mtrs, North-South 33 feet or 10.065 mtrs Length, Width to an extent of 110 Sq.yards or 92.4 Sq.mtrs is having **Boundaries: East:** Site of Pedakota Dalinaidu, **West:** Site of Pedakota Dalinaidu, **North:** Vacant Site of Gudla Mohana Rao and Others, **South:** Road.

KARANAM APPALA NAIDU
Dt.04-10-2024 Advocate, Srikakulam Ph.No.8464967756

ఎంసీఏ, ఎంబీఏ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఐసెట్ కౌన్సెలింగ్ అనంతరం మిగుల సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు నేరుగా సంబంధిత విభాగాలను సంప్రదించి ప్రవేశాలు పొందాలని, తప్పనిసరిగా ఐసెట్‌లో అర్హత సాధించాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ర్యాంక్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలు, టీసీ, కుల, స్టడీ తదితర ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో తక్షణ ప్రవేశాలకు హాజరుకావాలని సూచించారు. ఎంబీఏ కోర్సుల్లో రెగ్యులర్ 13, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీలో రెండు, ఎంసీఏ కోర్సుల్లో ఎనిమిది రెగ్యులర్, రెండు సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఖాళీ ఉన్నట్లు స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

చిన్నారుల చేతికందని కొత్త పుస్తకం..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో పాతవాటితోనే బోధన

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచాయి. ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పాఠ్యపుస్తకాలు చేరలేదు. ఫలితంగా చిన్నారులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు ఆటంకం కలుగుతోంది. అరకొరగా ఉన్న పాత వాటితోనే బోధన సాగిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించట్లేదు. కొందరు ఇంటి నుంచే రాత పుస్తకాలు తీసుకువచ్చి సాధన చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం త్వరితగతిన పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)



గుజరాతీపేట కేంద్రంలోని చిన్నారులు

జిల్లాలో వివరాలిలా..
- ఐసీడీఎస్ ప్రాజెక్టులు: **16**
- అంగన్‌వాడీ కేంద్రాలు: **3,358**
- 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు: **39,085**

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అందించి.. ఆ తర్వాత వారు నేరుగా ఒకటో తరగతిలో చేరేలా అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు పాఠ్యపుస్తకాల రూపకల్పనతో పాటు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేశారు. పీపీ(ప్రీప్రైమరీ)-1, 2 పేరిట రెండు రకాల పుస్తకాలను పంపిణీ చేసి.. వాటి ఆధారంగా విద్యాబోధన జరిపేవారు. పాటలు, పద్యాలతో పాటు, నెలలు, వారాలు, రోజులు తదితర అంశాలను వివరించేవారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఏ రోజు ఏం బోధించాలనేదీ పట్టిక రూపంలో ఇస్తుండేవారు. ఆంగ్లంలోనే సులువుగా అర్థమయ్యే పదాలు చెప్పడం వాటి అర్థాలు తెలుసుకోవడం, సృజనాత్మకత ఆటలు వంటి కృత్యాలు చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాలు రాకపోవడంతో అవేమీ సక్రమంగా అమలు కావట్లేదు.

పునశ్చరణకు దూరం..

చిన్నారులు విద్య నేర్చుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా ఉండాలనే ఉద్దేశంతో అధికారులు గతంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లల తల్లుల ఫోన్ నంబర్లతో తరగతులవారీగా వాట్సాప్ బృందాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా కేంద్రాల్లో ఉదయం బోధించిన అంశాలు, చేయించిన కృత్యాలకు సంబంధించిన వివరాలను వాట్సాప్‌లో పంపేవారు. సాయంత్రం ఇంటి వద్ద పునశ్చరణ చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాల్లేకపోవడంతో అదీ జరగడం లేదు.

రాగానే పంపిణీ చేస్తాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు రావాల్సిన విషయం వాస్తవమే. ప్రస్తుతానికి కార్యకర్తలు పాతవాటితో బోధన సాగిస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని తెలిసింది. రాగానే అన్ని కేంద్రాలకే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

4 రోజులు.. 23 దరఖాస్తులు..!

కొనసాగుతున్న మద్యం దుకాణాల ఏర్పాటు ప్రక్రియ

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లాలో నూతనంగా ఏర్పాటు కానున్న 158 ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. నూతన మద్యం విధానం ఖరారు కావడంతో ఈ నెల 1న ప్రకటన విడుదలకాగా.. ఇప్పటి వరకు మొత్తం 23 మంది దరఖాస్తులు సమర్పించారు. వాటిల్లో శుక్రవారం ఒక్కరోజే 16 వచ్చాయి. ఆమదాలవలస, కొత్తూరు, పాతపట్నం, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం సర్కిళ్ల పరిధిలో ఒక్కటి కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉన్నందున చివరి రోజుల్లో భారీ ఎత్తున దరఖాస్తులు నమోదు అవుతాయని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ

శ్రీకాకుళం నగరం, ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలం పైడిభీమవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి కంటి శస్త్ర చికిత్సకు కారణమైన ఉపాధ్యాయుడు ఎస్.అరుణకుమార్‌కు డీఈవో ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. విద్యార్థికి మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

పాలకొండ బ్రాంచ్
మెయిన్ రోడ్డు, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా
ఫోన్ : 93269 04391, ఇ-మెయిల్ : ubin0804398@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1) ప్రకారం నోటీసు (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) నందలి రూల్ 3తో చదివే సెక్షన్ 13(2) ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాలకొండ బ్రాంచ్** యొక్క అధీకృత అధికారిగా **తేది.15.07.2024** న డిమాండ్ నోటీసు జారీ చేయటమైనది. **ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ శ్రీ గాయత్రి కళ్యాణ మండపం, ప్రొప్రయిటర్ : శ్రీ పైడి సత్యప్రసాద్,** రామకళామందిర్ వీధి, పాలకొండ, శ్రీకాకుళం-532440. **1(ఎ) శ్రీ పైడి సత్యప్రసాద్, తండ్రి. పి. శ్రీ రామమూర్తి లేటు,** డి.నెం.3-284, రామకళామందిర్ వీధి, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532440. **2(ఎ) శ్రీమతి పైడి అమ్మాజి, భర్త.** పైడి సత్యప్రసాద్, డి.నెం.3-284, రామకళామందిర్ వీధి, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా, ఆం.ప్ర-532440. **2(బి) శ్రీ పొన్నాడ ప్రసాద రావు, తండ్రి. పి. నాగభూషణం లేటు,** డి.నెం.11-354, గేదెల వారి వీధి, పాలకొండ, శ్రీకాకుళం-532440 వార్లను నోటీసులో తెలియజేయబడిన **రూ.19,76,558.34 పై (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై ఆరు వేల ఐదు వందల యాభై ఎనిమిది రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే)** నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవల్సినదిగా కోరడమైనది.

ఋణగ్రహీతలు సదరు మొత్తమును తిరిగి చెల్లించక విఫలమైనందున సదరు 8వ రూల్‌తో చదవబడే సదరు చట్టంలో సెక్షన్ 13(4) క్రింద దిగువ సంతకందారు తనకు సంక్రమించిన అధికారములును వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.01.10.2024** న స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయటమైనది.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **తేది.01.10.2024** నాటికి **రూ.19,76,558.34 పై (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై ఆరు వేల ఐదు వందల యాభై ఎనిమిది రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే)** మరియు వడ్డీ, ఇతర ఖర్చులు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాలకొండ బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

ప్రైమరీ సెక్యూరిటీ : అన్ని ప్రస్తుత ఆస్తులు, పూర్తయిన వస్తువులు, ఫినిష్డ్ గూడ్స్, రావలసినవి మరియు అవుట్‌లెట్ ప్రాంగణంలో & ఇతర చోట్ల, ప్రస్తుత మరియు భవిష్యత్తు రెండింటిలోనూ సంస్థ యొక్క ఇతర ఛార్జ్ చేయదగినవి ప్రస్తుత ఆస్తులపై హైపోథికేషన్ ఛార్జ్ చేయబడినవి.
కొల్లేటరల్ సెక్యూరిటీ : శ్రీకాకుళం జిల్లా, పాలకొండ నగర్ పంచాయితీ & మండలం, పాలకొండ, డి.నెం.3-284 దగ్గర, రామకళామందర్ వీధి వద్ద గల సర్వే నెం.466/భాగంలోని విస్తీర్ణం 10841.8 చ॥గ॥లు లేదా 9064.95 చ॥మీ॥లులోని కమర్షియల్ ఆస్తి **శ్రీ పైడి సత్యప్రసాద్ గారికి** చెందినది. **హద్దులు : తూర్పు :** గోపాల్ రావు గారి ఆస్తి, **పడమర :** పైడి దుర్గా ప్రసాద్ గారి స్థలం, **ఉత్తరం :** పైడి గోపాల రావు గారి స్థలం, **దక్షిణం :** కెనాల్, వెంకటరాజు చెరువుగట్టు.
గమనిక : ఈ ఆస్తి **శ్రీ పైడి సత్య ప్రసాద్ గారి** పేరు మీద ఉన్న రూ.14.00 లక్షలు ABPOD కి కూడా విస్తరించబడినది.

తేది : 01.10.2024 సం/- అధీకృత అధికారి
స్థలం : పాలకొండ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జనవరిలో కొత్త కలెక్టరేట్ ప్రారంభిస్తాం: మంత్రి



పనుల పురోగతి తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి.. జనవరిలో ప్రారంభిస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి శుక్రవారం నూతన కలెక్టరేట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ఈ కలెక్టరేట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. సాంకేతిక కారణాలతో పనులు ఆగాయని, వాటిని రెండు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించాలని గుత్తేదారుడిని ఆదేశించారు. సాంకేతిక సమస్యలపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, చీఫ్ ప్యాట్రిన్‌గా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అధ్యక్షులుగా సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందరలాల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.యుగంధర్, కోశాధికారిగా చాపర వెంటకరమణ, కార్యనిర్వహణ కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, కార్యదర్శిగా జి.వాసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్, రాష్ట్రకార్యదర్శి లెనిన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

తూర్పు కోస్తా రైల్వే జీఎం దృష్టికి సమస్యలు



జీఎంతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్ తదితరులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యలను కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే డా.బెందాళం అశోక్ తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ దృష్టికి తీసుకెళ్లారు. భువనేశ్వర్‌లో శుక్రవారం ఖుర్దా పరిధిలోని ఎంపీలతో రైల్వే జీఎం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం, సోంపేట ఆర్ఎస్, బారువ, జాడుపూడి, మందస రైలు నిలయాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆంధ్ర, ఒడిశాలలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కీలకంగా ఉన్న ఇచ్ఛాపురం రైలు నిలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇప్పటికే బోర్డు పరిశీలనలో ఉన్న రైళ్ల హాల్టులతో పాటు, ఐదు సూపర్‌ఫాస్ట్ రైళ్లను ఇచ్ఛాపురంలో ఆపాలని ఎమ్మెల్యే అశోక్ విన్నవించారు. వాటికి జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒడిశాలోని చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్, తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

PLOT FOR SALE

LAND FOR SALE

TO LET

COMMERCIAL

JOBS

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315/-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పుష్పలత

నరసన్నపేట, శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందిన క్రీడాకారిణి రుప్ప పుష్పలత ఎంపికైంది. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న క్రీడాకారిణి గత నెల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈ నెల 6 నుంచి నొయిడాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారిణిని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాస్, శిక్షకులు కె.నివాస్‌కుమార్, కోటిపల్లి అనిల్‌కుమార్, ఎన్ఎఫ్ఏ ప్రతినిధులు అభినందించారు.

లేఖారచన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: స్టాంపుల సేకరణ అభిరుచిని పెంపొందించాలనే ఉద్దేశంతో తపాలాశాఖ జాతీయ స్థాయిలో 'ఢాయ్ అఖర్' పేరుతో లేఖారచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ వి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ది జాయ్ ఆఫ్ రైటింగ్ - ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్' శీర్షికతో ఉద్దేశించి తెలుగు, హిందీ, ఆంగ్లంలో ఉత్తరాలు రాయాల్సి ఉంటుందని వివరించారు. అన్ని వయసులవారు పోటీలో పాల్గొనవచ్చునని చెప్పారు. ఇన్‌ల్యాండ్ లెటర్‌పై 500 పదాలకు మించకుండా, ఏ4 సైజు కాగితంపై రాసేవారు 1000 పదాలకు మించకుండా సొంత చేతిరాతతో రాసి తపాలా సూపరింటెండెంట్, శ్రీకాకుళం డివిజన్, శ్రీకాకుళం-532001 చిరునామాకు డిసెంబర్ 14లోగా పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని వెల్లడించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఏం చేస్తున్నారు?



సమీక్షిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం, చిత్రంలో ఇతర అధికారులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ కవితను ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలో శుక్రవారం బాలల హక్కుల రక్షణలో భాగంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ఎంత మంది విభిన్న ప్రతిభావంతులైన బాలలు ఉన్నారు? వారికి ఏయే సౌకర్యాలు కల్పిస్తున్నారు? తదితర వివరాలను ఆరా తీశారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో సమాచారం తెలియజేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు సీతారాం తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సకాలంలో సదరం ధ్రువపత్రాలు అందకపోవడంతో బాలలు హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, సభ్యులు రమణమూర్తి, గన్నెప్పడు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీపీసీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ



బాబూరావును అభినందిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

పలాస, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్(ఏపీటీపీసీ) ఛైర్మన్‌గా వజ్జ బాబూరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ విభాగ అధికారులు పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాబూరావును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ కౌన్సిలర్ వజ్జ గంగాభవాని, తెదేపా నాయకులు అభినందించారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: మాస్టర్ ట్రైనీలు తమకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్తు సీఈవో వెంకట్రామన్ సూచించారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీల శిక్షణ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ సిబ్బంది, ట్రైనీలు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌కు రూ.2.50 లక్షల వితరణ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌కు పలువురు రూ.2.50 లక్షలు వితరణగా అందజేశారు. కోటబొమ్మాళికి చెందిన సకలాభక్తుల గంగారావు తనతండ్రి సదాశివ సేవా ఫౌండేషన్ పేరుతో తల్లి సులోచనమ్మ ద్వారా రూ.లక్ష, పైడిశెట్టి రామ్‌కుమార్ సోదరులు రూ.లక్ష, బోయిన శివప్రసాద్ రూ.25 వేలు, పొట్నూరు నరసింహ సోదరులు రూ.25 వేలు మంత్రి కె.అచ్చెన్నాయుడికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దాతలను ప్రశంసించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కల్లి నాగయ్య రెడ్డి, లక్ష్మణరెడ్డి, ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్, లచ్చుమయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న సకలాభక్తుల సులోచనమ్మ, గంగారావు

శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్‌గా అమరశివుడు



శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్(డీఎం)గా అమరశివుడు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. విశాఖపట్నం కాంప్లెక్స్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజరుగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇంతవరకు ఆ స్థానంలో పని చేసిన మల్లికార్జునరాజును విశాఖపట్నానికి బదిలీ చేశారు. అమరశివుడు 1997 నుంచి 2007 వరకు శ్రీకాకుళం ఒకటో డిపోలో, 2013 నుంచి 2016 వరకు రెండో డిపోలో ఎస్టీఐ, టీఐ-2, సీఐ హోదాల్లో పని చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ జక్కరపేట గ్రామానికి చెందిన పాత్రపురం మంగులు(60) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. . కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికొచ్చారు. మళ్లీ అనారోగ్యానికి గురవడం, కుటుంబసభ్యులు పట్టించుకోవడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన మంగులును టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూబీఐ అప్రైజర్ నుంచి నగదు వసూలు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వెంకటాపురంశాఖలో గిల్టు నగలను తాకట్టు పెట్టి రూ.లక్షల్లో రుణాలు తీసుకున్న అప్రైజర్ రవితేజ నుంచి బ్యాంకు అధికారులు నగదు వసూలు చేశారు. తీసుకున్న రుణ మొత్తాన్ని తిరిగి బ్యాంకుకు కట్టించారు. పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుకు అధికారులు సిద్ధం కావడంతో అప్రైజర్ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేశారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఇంత జరిగిన సదరు అప్రైజర్‌ను ఇంకా కొనసాగిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

(c) eenadu

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

విజేతలకు అభినందనలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆశి రేవంత్‌రెడ్డి, నీలాపు భగవాన్, తిప్పన జీవన్, చాట్ల గిరి తిరుపతి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చీఫ్ కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ● జిల్లా స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పాలేపు సాయి జగదీష్‌ను జ్ఞానభారతి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.


విద్యార్థులతో కోచ్ దుర్గాప్రసాద్ తదితరులు

ఎస్పీ గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ప్రతి వారం నిర్వహిస్తున్న ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 8 వినతులు అందగా వారితో నేరుగా ఎస్పీ మాట్లాడి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కంచమ్మతల్లి సేవలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి

కంచిలి పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం కంచమ్మతల్లిని సోంపేట కోర్టు 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన కొండూరు కిషోర్‌బాబు శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం చిన్నఒగిరాల గ్రామానికి చెందిన ఆయన గతంలో నూజివీడు జూనియర్ సివిల్ జడ్జి కోర్డులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విధులు నిర్వహించారు. – న్యూస్‌టుడే, కంచిలి




ఇచ్ఛాపురంలో స్వేచ్ఛావతి అమ్మవారికి శాస్త్రీయ నృత్యనీరాజనం


ఇచ్ఛాపురం: మహాలక్ష్మీదేవికి ఎర్రని మందారాల అలంకరణ

అంబ పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవికి పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు.

–న్యూస్‌టుడే బృందం


వజ్రపుకొత్తూరు: దోకులపాడులో పూజలందుకుంటున్న దుర్గాదేవి

చిన్నారుల భయాందోళన

వజ్రపుకొత్తూరు మండలం బెండి పంచాయతీ పరిధి మహదేవిపురంలోని అంగన్‌వాడీ భవనం గచ్చులు పాడవ్వడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విష సర్పాలు లోపలకు రావడంతో పిల్లలు భయాందోళన చెందినట్లు వారి తల్లిదండ్రులు వాపోయారు. జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావు, తెదేపా నాయకుడు కూన షణ్ముఖరావు భవనాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



గుంతల దారిలో అవస్థలు




పలాస మండలం టెక్కలిపట్నం నుంచి రేగుల పాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి వరకూ రహదారి గుంతలమయంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. బెండిగేటు నుంచి రేగుల పాడు వరకు రహదారి మరమ్మతుల బిల్లులు రాకపోవటంతో గుత్తేదారుడు పనులు నిలిపివేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభం అవుతాయని ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ అన్నారు .– న్యూస్‌టుడే, పలాస

పారిశుద్ధ్య మెరుగులో నిర్లక్ష్యం వద్దు

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం చూపించవద్దని పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. కాశీబుగ్గలో మస్తర్‌పాయింట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సమయపాలన పాటించి, వార్డుల్లో చెత్తలేకుండా శుభ్రంచేయాలని, విధులకు డుమ్మాకొడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెల్త్‌అసిస్టెంట్ శేఖర్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


కాశీబుగ్గలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు





బాధ్యతల స్వీకరణ

కంచిలి, న్యూస్‌టుడే : కంచిలి మండల తహసీల్దార్ ఎన్.రమేష్, వెలుగు ఏపీఎంగా ఎస్.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీలపై వెళ్లిన రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల స్థానాల్లో కొత్తగా ఇక్కడికి వచ్చినవారు బాధ్యతలు చేపట్టారు.

నిత్యావసర సరకుల వితరణ

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మండపల్లి సమీపంలో సీతయ్య ఫౌండేషన్ అనాథాశ్రమానికి ఎస్.ఎం.ఎస్ ఫౌండేషన్ సభ్యులు రూ.22 వేల విలువైన నిత్యావసర సరకులను శుక్రవారం అందించారు. ఆ ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సరకులు అందించడం ఆనందంగా ఉందని సభ్యులు తెలిపారు.

కాలువ పనులకు శంకుస్థాపన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : కవిటి మండలం కొజ్జిరియాలో మండల పరిషత్తు 15వ ఆర్థిక సంఘం రూ.3 లక్షలతో చేపడుతున్న కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కడియాల పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అనధికారిక వసూళ్లపై ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయతీలోని పూండిబస్టాండ్ మార్కెట్, పూండి వారపు సంతలో అనధికారికంగా వసూళ్లు జరుగుతున్నాయని, ఆ ఆదాయం పంచాయతీకి చేరడం లేదంటూ స్థానిక సర్పంచి పాలిన రమ్య ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇదే విషయమై మండల ఈవోపీఆర్డీ, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పట్టణంలోకి భారీ వాహనాలు అనధికారికంగా ప్రవేశించడంపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ సీఐ డి.మోహనరావును కలిసి వినతి పత్రం అందజేశారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు విలువైన వస్తువులను భద్రపరచుకోవాలని ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు సూచించారు. మహిళలు విలువైన వస్తువులు ధరించి బయటకు వెళ్లరాదని సూచించారు.

నాటుసారా పట్టివేత

కంచిలి, న్యూస్‌టుడే : కంచిలికి చెందిన ఓ మహిళ అక్రమంగా నాటుసారా విక్రయిస్తుందన్న సమాచారంతో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆమె నుంచి 18 లీటర్ల నాటు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రేషన్ దుకాణం ప్రారంభం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరులో ఎమ్మెల్యే శిరీష ఆదేశాలతో ఇక్కడ కొత్తగా రేషన్ దుకాణాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ దుకాణాన్ని మండల తెదేపా అధ్యక్షుడు సూరాడ మోహనరావు ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో చాలా మందికి కొత్తగా రేషన్ కార్డులు లేనందున త్వరలోనే వాటిని మంజూరు చేసే బాధ్యత తీసుకుంటామని కూటమి నాయకులు పేర్కొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా ఉపాధి కల్పన, గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కేశుపురంలో ఉపాధి పనులను గుర్తించేందుకు శుక్రవారం నిర్వహించిన సభకు ఏపీవో పి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించి, పనుల విధి విధానాలను వివరించారు. సర్పంచి గుజ్జు ఢిల్లీరావు, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

? నందిగాం మండలం గొల్లవూరు పంచాయతీ చిన్నారిగోకర్లపల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
- రట్టి నాగరాజు, స్థానికుడు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తెలియజేస్తాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి, గొల్లవూరు** – న్యూస్‌టుడే, నందిగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? కొత్తూరు, మెట్టూరు, గూనభద్ర, పారాపురం, నివగాం గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. **- ఆయా గ్రామస్థులు**

● పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.
- బీవీఆర్ ప్రసాదరావు, ఈవోపీఆర్డీ – న్యూస్‌టుడే, కొత్తూరు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : వన్యప్రాణులు, అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని టెక్కలి అటవీశాఖ రేంజ్ అధికారి జి.జగదీశ్వరరావు అన్నారు. తెలినీలాపురంలోని పక్షుల సంరక్షణ కేంద్రం వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణులను వేటాడినా, వాటికి హాని కలిగించినా చట్ట ప్రకారం తీసుకునే చర్యలను వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అటవీశాఖ రేంజర్ జి.జగదీశ్వరరావు

రహదారికి మరమ్మతులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం మరువాడ- గుడ్డిమీదపేట రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో మరువాడ సర్పంచి ప్రతినిధి సూరాడ దాసురాజు ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. నీరు నిల్వ ఉండకుండా కల్వర్టు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సూరాడ ధనరాజు, నూకయ్య, భీమారావు పాల్గొన్నారు.

టెట్‌కు 58 మంది గైర్హాజరు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రెండో రోజు స్థానిక కోర్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రశాంతంగా జరిగినట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి దాలినాయుడు తెలిపారు. 58 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

నరసన్నపేట, న్యూస్‌టుడే: అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డుకు నరసన్నపేటకు చెందిన సీహెచ్.దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న గుంటూరులో అవార్డు ప్రదానం చేయనున్నట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు.

టెక్కలి

● టెక్కలి ● నరసన్నపేట ● పాతపట్నం

కార్మికుడా నీ సేవకు సలాం

టెక్కలిలోని అక్కపువీధిలో కల్వర్టు కింది భాగంలో పూడిక పేరుకుపోయి మురుగు కదలక కొన్నిరోజులుగా తీవ్ర దుర్గంధం నెలకొంది. సమస్యను పరిశీలించేందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు సమక్షంలో ఓ పారిశుద్ధ్య కార్మికుడు మురుగు నీటిలో చేతులు పెట్టి చెత్తను తొలగించడాన్ని పలువురు ప్రశంసించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. – న్యూస్‌టుడే, టెక్కలి



అందని వేతనాలు.. తీరని వెతలు..!

న్యూస్‌టుడే, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం

గ్రామాల్లో మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వెలుగు ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుంది. వీటన్నింటిని సమర్థంగా అమలు చేయడంలో గ్రామ సంఘం సహాయకుల పాత్ర కీలకం. అటువంటి వారికి ప్రభుత్వం ఐదు నెలలుగా వేతనాలు అందించడం లేదు. దీంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించాలని వారంతా కోరుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితిపై కథనం.


కొత్తూరు: వసపలో ఆందోళన చేస్తున్న వీవోఏలు

ఇదీ పరిస్థితి

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 172 మంది గ్రామ సంఘం సహాయకులు (వీవోఏ) విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను గ్రామాల్లో అమలు చేయడంలో వీరంతా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల రూ.8 వేలు వేతనం అందాల్సి ఉంది. వీరికి నెలవారి ఇవ్వాల్సిన వేతనం సక్రమంగా అందడం లేదు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో నాలుగు నెలలు అందలేదు. అప్పటి నుంచి వారు పోరాటం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఎన్నికల ముందు వైకాపా పెద్దలకు సమస్యలు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం రెండు నెలలు వేతనాలు ఇటీవల విడుదల చేసింది.

నియోజకవర్గం వివరాలు

మండలం	పంచాయతీలు	గ్రామ సంఘాలు	పనిచేస్తున్న వీవోఏలు
కొత్తూరు	43	36	33
హిరమండలం	25	30	29
ఎల్‌ఎన్‌పేట	19	29	29
పాతపట్నం	34	43	43
మెళియాపుట్టి	37	36	38

ధర్నా విజయవంతం చేయాలి

ఏడు నెలల వేతనాలు అందాల్సి ఉంది. ఇటీవల రెండు నెలలకు సంబంధించి ఇచ్చారు. పూర్తిస్థాయిలో విడుదల చేయాలి. ప్రతి నెల వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాలో వీవోఏలు అంతా పాల్గొని విజయవంతం చేయాలి.
– బాలమణి, వీవోఏ, నివగాం, కొత్తూరు మండలం

చర్యలు తీసుకుంటాం

వీవోఏలకు వేతనాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. బకాయిల కోసం సెర్ప్‌కు నివేదిస్తాం. అక్కడ నుంచి వచ్చి ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.
– సన్యాసిరావు, వెలుగు ఏపీడీ, సీతంపేట

విద్యుత్తు కోతలతో రోగుల ఇక్కట్లు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక తెంబూరు రోడ్డుమార్గంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో జిల్లా ఆసుపత్రిలో రోగులు శుక్రవారం ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహణ పనుల కారణంగా సరఫరా నిలిపివేయడంతో ఉక్కపోతతో బాలింతలు, ఇతర రోగులు అసౌకర్యానికి గురయ్యారు.

ఇసుక సమస్యను పరిష్కరించాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఇసుక సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకుడు నంబూరు షణ్ముఖరావు డిమాండు చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ, సీపీఎం కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఇసుకను ఉచితంగా అందించాలన్నారు. ప్రస్తుతం అధిక ధరలకు మాత్రమే లభిస్తుండటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని, కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కొల్లి ఎల్లయ్య, బగాది వాసు, సత్తారు ఉత్తర, వేణు, అప్పన్న, హరిబాబు, త్రినాథ్, కృష్ణ, మల్లేషు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అవకతవకలపై విచారణ


వెంకటాపురంలో దర్యాప్తు చేపడుతున్న అధికారులు

జలుమూరు, సారవకోట, న్యూస్‌టుడే: జలుమూరు మండలంలోని తిమడాం, వెంకటాపురం (ఉపాధిహామీ పథకం) క్షేత్రసహాయకులపై వచ్చిన ఫిర్యాదులపై ఏపీడీ కె.లోకేశ్ శుక్రవారం విచారణ చేపట్టారు. తెదేపా మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, వెలమల చంద్రభూషణరావు, వెలమల రామారావు పాల్గొన్నారు. ● సారవకోట మండలం చీడిపూడి పంచాయతీకి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకురాలు చెంచల నిర్మలపై స్థానిక వేతనదారులు చేసిన ఫిర్యాదు మేరకు ఏపీడీ విచారణ జరిపారు. ఏపీవో నారాయణరావు పాల్గొన్నారు.

తొలగించారు.. తరలించేదెప్పుడు..?

పోలాకిలో మండల వనరుల కేంద్రానికి వెళ్లే మార్గంలో కాలువలో పూడిక తొలగించారు. అనంతరం తరలించక పోవడంతో తిరిగి కాలువలోకి వ్యర్థాలు చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ వద్ద ప్రస్తావించగా సిబ్బందికి తెలియజేసి వెంటనే చెత్తను తరలిస్తామని పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, పోలాకి



ప్రయాణించాలంటే ప్రయాసే..!



ఎల్‌ఎన్‌పేట మండలంలో గ్రామీణ రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గుంతలమయంగా మారడంతో ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఏబీ రహదారి నుంచి బొరమాంబపురం, కొమ్మువలస, గొట్టిపల్లితోపాటు 15 గిరిజన గ్రామాలకు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి మరమ్మతులైనా చేపట్టాలని పలువురు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని పీఆర్ జేఈ భాస్కరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

రక్షణ కంచె ఏర్పాటు చేయరూ

నందిగాం మండలం చిన్నారిగోకర్లపల్లి గ్రామ సమీపంలో గొల్లవూరు- రాంపురం బీటీ రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ముందే మేల్కొంటే మంచిదని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తు శాఖ ఏఈ నేతాజీ పేర్కొన్నారు.
– న్యూస్‌టుడే, నందిగాం



ఉత్తర్వులు పట్టవు.. పేరు మారదు



ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇవేవి అధికారులకు పట్టడం లేదు. కొత్తూరులోని తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కేంద్రం పేరు ఇంకా మార్చలేదు. నిత్యం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రానికి వస్తున్నా.. పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారిణి స్వర్ణలత మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ఆసుపత్రి ఆవరణలో దుర్గంధం



టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆవరణ మురుగునీటితో దుర్గంధ భరితంగా మారింది. మురుగునీటి గొట్టాలు పగిలిపోయి నీరంతా ఆసుపత్రి వెనుకభాగంలో పెద్దఎత్తున చేరుతోంది. దీని ప్రభావంతో దుర్గంధంతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో వచ్చేవారికి ఇక్కడి సమస్యతో మరింత ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. సమస్యపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

రెండో పంటకు నీరివ్వండి


మాట్లాడుతున్న నీటిపారుదల అధికారులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: వంశధార కాలువల ద్వారా వచ్చే రబీ సీజన్‌కు సాగునీరివ్వాలని పలువురు సభ్యులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఈ సురేష్ మాట్లాడుతూ వచ్చే మార్చి వరకు సాగునీరు అందిస్తామన్నారు. పలు కాలువలకు నీరు సరఫరా కావడం లేదని జమ్ము సర్పంచి వాన గోవిందరావు పేర్కొన్నారు. యూరియాకు కొరత లేదని వ్యవసాయాధికారిణి సునీత చెప్పారు. ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దారు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నరసన్నపేట, న్యూస్‌టుడే: వంశధార నదిలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టరు పోలీసులకు పట్టుబడింది. నరసన్నపేట మండలం గోపాలపెంట రేవులో శుక్రవారం ఉదయం వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

జగన్మాతా నమోస్తుతే..!


చాపర రాజరాజేశ్వరిదేవి పీఠంలో కుంకుమ పూజలు


పాకివలసలో అమ్మవారికి వెండి కిరీటాన్ని అందించిన గోవిందరావు దంపతులు


శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న వారాహీ అమ్మవారు


మాకివలసలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భవానీ భక్తులు


సంతబొమ్మాళి మండలం సంధీపేటలో..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ ఆలయాల్లో, మండపాల్లో భక్తులు శుక్రవారం శ్రీచక్ర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. – న్యూస్‌టుడే బృందం


పాతపట్నంలో ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో..

ఉత్సవాలు విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి ఉత్సవాలను విజయవంతం చేసిన జిల్లా అధికారులు, పోలీసులు, స్థానిక నాయకులు, ప్రజలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడంలో ముఖ్య పాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మంత్రి పరామర్శ

కోటబొమ్మాళి మండలంలోని వాంగ్రాడ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు నక్క అసిరితాత కుమారుడు వెంకటేష్ ఖమ్మంలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు పరామర్శించారు. కస్తూరిపాడుకు చెందిన సీనియర్ కార్యకర్త సనపల కూర్మినాయకుడు కుమారుడు శివకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబానికి మంతి ధైర్యం చెప్పారు.

సంక్షిప్త సమాచారం

మంత్రి దృష్టికి సమస్యలు



హిరమండలం, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడిని శుక్రవారం నిమ్మాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెదేపా నాయకుడు తేజ పాల్గొన్నారు.

అనుమతి పత్రాలు లేకుంటే చర్యలు

కొత్తూరు, న్యూస్‌టుడే: అనుమతి పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అహ్మద్ స్పష్టం చేశారు. మండలంలోని గూనభద్ర వంతెన వద్ద శుక్రవారం రాత్రి ఆయన వాహనాలు తనిఖీ చేశారు.

విద్యార్థులకు నైపుణ్య తరగతులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.వి.రత్నకుమారి తెలిపారు. దసరా సెలవుల్లో పాతపట్నం, పర్లాఖెముండిలోని మీసేవ, కంప్యూటర్, ఇంటర్‌నెట్ సెంటర్లలో శిక్షకుడు వై.నరేష్, పర్యవేక్షకుడు జి.శంకరరావు ఆధ్వర్యంలో తర్ఫీదు ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు.

పూడిక తొలగింపు

స్పందనకు వందనం

హిరమండలం, న్యూస్‌టుడే: ధనుపురం గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులపై ఇటీవల ఈనాడులో వార్త ప్రచురితమవడంతో స్పందించిన సర్పంచి దారపు ఢిల్లేశ్వరరావు పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పొక్లెయిన్‌తో కాలువల్లో పూడికలు తొలిగించారు.

పర్యావరణ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి, న్యూస్‌టుడే: లింగాలవలస పంచాయతీలోని ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించి పర్యావరణ అనుమతులకు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. డీఆర్వో అప్పారావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణశ్రీ, భూగర్భగనులశాఖ సహాయ సంచాలకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలు ముగియడంతో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన వ్యర్థాలను తొలగించారు. డీఎల్‌పీవో ఐవీ రమణ, ఈవో చింతాడ సన్యాసి పర్యవేక్షించారు.

వరి పంట పరిశీలన

పోలాకి, న్యూస్‌టుడే: కుసుమపాలవలస, గొల్లలవలస గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం కేవీకే శాస్త్రవేత్తలు వరి పంటను పరిశీలించారు. రెండు గ్రామాల పరిధిలో పంటను సుడిదోమ, పొడ తెగులు ఆశించినట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు ఎస్.నీలవేణి, ఎస్.అనూష, సర్పంచి తర్ర లక్ష్మీనారాయణ, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

జలుమూరు, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి యు.చిన్నరాజులు అన్నారు. గర్భిణులు, బాలింతలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా లింగాలపాడులో శుక్రవారం సర్వే నిర్వహించారు.

గ్రామీణ ప్రజలకు తాగునీరు అందించాలి


పాతపట్నం, న్యూస్‌టుడే: ప్రజలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పేర్కొన్నారు. వైకాపా హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు రూ.లక్షలు వెచ్చించామన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

న్యూస్‌టుడే, సారవకోట

సారవకోట మండలంలోని గొర్రిబంద పంచాయతీ కోనవానిపేట గిరిజన గ్రామంలో పది నెలలుగా సోలార్ మంచినీటి పథకం పనిచేయడం లేదు. దీంతో తాగునీటికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. పథకాన్ని బాగు చేయించి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మండల పరిషత్తు కార్యాలయంలో తెలియజేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 70 కుటుంబాలు ఉండగా, బావి వద్ద పథకం ఏర్పాటు చేసి, వీధుల్లో నీరు సరఫరాకు వీలుగా పలుచోట్ల కుళాయిలు అమర్చారు. సరఫరా లేక అవన్నీ అలంకార ప్రాయంగా మిగిలాయి. గ్రామంలో ఉన్న బావులు, చేతిపంపులను ఆశ్రయించి గొంతు తడుపుకొంటున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి పథకాన్ని బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు.


అలంకార ప్రాయంగా కుళాయిలు


కోనవానిపేటలో నిరుపయోగంగా సోలార్ మంచినీటి పథకం

పాలకులు దృష్టి సారించాలి



గ్రామంలోని సోలార్ మంచినీటి పథకం పది నెలలుగా పనిచేయడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. పాలకులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.
– సవితి ఆదిలక్ష్మి, గ్రామస్థురాలు, కోనవానిపేట

సమస్యను పరిష్కరిస్తాం

పథకానికి సంబంధించిన సోలార్ మోటారు పనిచేయక పోవడంతో విద్యుత్తు మోటారు అమర్చి నీరందించాం. పథకానికి సంబంధించిన పంపుసెట్ పాడవటంతో మరమ్మత్తుల కోసం పంపించాం. త్వరలోనే ఈ పరికరాన్ని అమర్చి సమస్యను పరిష్కరిస్తాం.
– గాయత్రి, పంచాయతీ కార్యదర్శి, గొర్రిబంద

ప్రజల భాగస్వామ్యంతో మందిరం నిర్మాణం

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలంలో సత్యసాయి మందిరాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తామని ఏపీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం హిరమండలం మేజరు పంచాయతీలో శిథిలావస్థకు చేరిన మందిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సింహాద్రి కాళీప్రసాదరావు నిర్మాణానికి రూ. లక్ష చెక్కు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, ప్రతినిధులు నాగేశ్వరరావు, బి.నర్సింహారావు, కె.వి.రమణమూర్తి పాల్గొన్నారు.


రూ.లక్ష చెక్కును సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులకు అందజేస్తున్న సింహాద్రి కాళీప్రసాద్

వైద్య శిబిరానికి స్పందన


ఉర్లాంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, న్యూస్‌టుడే: శిమ్మినాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉర్లాంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు నిర్వహించారు. 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు శంకర్ ఫౌండేషన్ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్లాం పీహెచ్‌సీ వైద్యురాలు సుజాత, నేత్ర వైద్య నిపుణులు రుచిత, బాలగంగాధరరాజు, ఆరోగ్యవిస్తరణ అధికారి గణపతిరావు పాల్గొన్నారు. ● నరసన్నపేట విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన చేకూరింది. స్థానిక సంఘ భవనంలో వి డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో విశ్రాంత ఉద్యోగులకు వైద్యురాలు ప్రియాంక పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

(c) eenadu

శ్రీకాకుళం
●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించ వచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

తెరపై ఈనాడు

● **కీర్తన:** రామ్‌నగర్ బన్నీ ● **కీర్తిక:** సత్యం సుందరం ● **కిన్నెర సినీమాక్స్:** దేవర ● **ఎస్‌వీసీ (రామలక్ష్మణ):** దక్షిణ ● **సూర్యమహల్:** స్వాగ్ ● **సరస్వతి:** దేవర ● **చంద్రమహల్:** మత్తు వదలరా-2 ● **మారుతి:** చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఎచ్చెర్ల మండలంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షలకు 200 మందికి 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ఎస్పీని కలిసిన సీఐలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఇద్దరు సీఐలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నం సీఐగా వి.రామారావు, డీసీఆర్‌బీ సీఐగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణకు ముందు ఎస్పీకి పూల మొక్క అందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న బలగ మడ్డి వీధికి చెందిన సుశీలకు స్మాల్ సర్వీస్ టు సొసైటీ, ఎలియన్స్ క్లబ్ మిత్ర ప్రతినిధులు చేయూతనందించారు. వారికి శుక్రవారం రూ.32,000, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో భరత్ భూషణ్, కిల్లంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

దుకాణాల్లో ధరలు పెంచొద్దు

అరసవల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని తినుబండారాల దుకాణాలల్లో ధరలు పెంచొద్దని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జి.సీతారాం అన్నారు. శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ధరల పట్టికను పరిశీలించారు. డీపీటీవో విజయ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.



కాంప్లెక్స్‌లో తనిఖీ చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ ఏదీ?



సరుబుజ్జిలి: చిన్న వెంకటాపురంలో క్లోరినేషన్ చేయని మినీ రక్షిత నీటి పథకం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే విషయంలో శ్రద్ధ కొరవడుతోంది. సాధారణంగా మంచినీటి పథకాల నీటి నిల్వ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రపరచాలి. నీటి శుభ్రతను పరీక్షించాలి. అవసరాన్ని బట్టి ట్యాంకులకు నీరు సరఫరా అయ్యే గొట్టాలను శుభ్రం చేయించాలి. క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయించాలి. కానీ ఇవేమీ సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు ట్యాంకులను పట్టించుకునే నాథుడే కరవవ్వడంతో చాలా చోట్ల మరమ్మతులకు గురవుతున్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాల పరిశుభ్రత, క్లోరినేషన్ పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

గ్రామాల్లో నీటి పరీక్షలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెరువులు, బావులు, బోర్ల నుంచి వచ్చే నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలి. ఇందుకోసం నియోజకవర్గంలో నీటి నమూనా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్రమం తప్పకుండా నీటి పరీక్షలు చేసి ఫలితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద బహిరంగ పరచాలి. సురక్షితం కాని నీటిని తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలి. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రక్షిత పథకాలకు సంబంధించి ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలి. అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ట్యాంకును శుభ్రం చేసిన తేదీలను నల్లబోర్డుపై రాయాల్సి ఉంది. తాగునీటిలో బ్లీచింగ్ కలిపి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉంది.

"**శుభ్రం చేయించాల్సిందే** గ్రామ పంచాయతీలు నీటి ట్యాంకులను శుభ్రం చేయాల్సిందే. సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శులకు, ట్యాంకులు ఆపరేటింగ్ చేస్తున్న సిబ్బందికి సమావేశాలు నిర్వహించి వాటిని క్లోరినేషన్ చేయించాలని చెప్పాం."

– దుర్యోధన, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఆమదాలవలస

● **పొందూరు:** మండలంలోని 29 పంచాయతీల్లో 30 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటిలో పొందూరు, కింతలి, మొదలవలస గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు తప్ప మిగిలిన ట్యాంకులను శుభ్రం చేయడం లేదు.

● **సరుబుజ్జిలి:** మండలంలోని 21 పంచాయతీల్లో 6 గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేశారు. కొత్తకోట, పురుషోత్తపురం, ఇస్కలపాలెం, బుడ్డివలస, చిన్న వెంకటాపురం, దకరవలస గ్రామాల్లో రక్షిత పథకాలను నిర్మించారు. కాని వాటి వినియోగం పట్ల శ్రద్ధ చూపకపోవడంతో అక్కడ ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుంది.

● **ఆమదాలవలస:** మండలంలోని 30 పంచాయతీల్లో గాజులకొల్లివలస, సంతకొత్తవలస, సిరిసింపేట, జి.కె.వలస, శ్రీనివాసాచార్యులపేట, నెల్లిపర్తి, అక్కులపేట, వంజంగి, తొటాడ, గోపీనగరం, దూసిపేట, లొద్దలపేట, బెలమాం, కట్యాచార్యులపేట, తొగరాం, కొర్లకోట, కనుగులవలస తదితర గ్రామాల్లో మొత్తం 40 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క పథకాన్ని క్లోరినేషన్ చేయడం లేదు.


● **బూర్జ:** మండలంలోని 30 పంచాయతీల్లో 12 రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటిలో తోటవాడ రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. సింగన్నపాలెం రక్షిత మంచినీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన నేల బావిలో చెత్త పేరుకుపోవడంతో కలుషిత నీటినే ప్రజలు తాగుతున్నారు. కొమ్మువలస, రాజుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు ద్వారా నీరు సక్రమంగా రావడం లేదు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు గత నెల 29న జిల్లాలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. అండర్-18, ఆపై విభాగాల్లో పీయూసీ విద్యార్థులు పది మంది, ఇంజినీరింగ్ విద్యార్థులు పది మంది చక్కటి నైపుణ్యాలు ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5, 6 తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. వీరిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డా. కె.వి.జి.డి.బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, యోగా విభాగాధిపతి డా. ఈశ్వరరావు, అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు తదితరులు అభినందించారు.



డాక్టరేట్ ప్రదానం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరానికి చెందిన పి.వి.రమణమూర్తి డాక్టరేట్ అందుకున్నారు. ఈయన విద్యారంగంలో అందిస్తున్న సేవలకుగాను అమెరికాకు చెందిన స్ప్రింగ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో గురువారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ అమోస్ జేమ్స్ చేతుల మీదుగా ఈయన డాక్టరేట్ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను అపుస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణరావు, మోహనరెడ్డి అభినందించారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెమ్స్ వైద్యులు అప్పలకొండ, లిఖిత, శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని పీర్‌సాహెబ్‌పేటలో తెదేపా నాయకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జెమ్స్ పీఆర్‌వోతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మాజీ మంత్రికి పరామర్శ

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఇటీవల అస్వస్థతకు గురై.. ప్రస్తుతం విశాఖపట్నంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు శుక్రవారం పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శీర రమణయ్య ప్రమాణస్వీకారం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీయూఎఫ్ఐసీ) డైరెక్టర్‌గా శ్రీకాకుళం నగరానికి చెందిన శీర రమణయ్య విజయవాడలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమణయ్య తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేసిన ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణతో శీర రమణయ్య

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

● వివిధ సమస్యలపై 341 అర్జీలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్, చిత్రంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, తదితరులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి విడతగా 22 నుంచి 42 డివిజన్ల పరిధిలోని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం వివిధ సమస్యలపై 341 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా వ్యక్తిగత వినతులు ఉండగా.. పలు ప్రాంతాలకు చెందినవారు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుతో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దశలవారీగా నగరంలోని అన్ని డివిజన్ల ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉద్యాన అధికారి, ఇన్‌ఛార్జి సహాయ కమిషనర్, టి.ప్రసాద్, ఇంజినీర్ పి.గంగాధరరావు, టీపీవో పి ఉమామహేశ్వరరావు, ప్రజారోగ్యాధికారి డా పి.సుధీర్‌కుమార్, తెదేపా నాయకులు ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా....

● టిడ్కో ఇళ్ల మంజూరు కాకపోగా డిపాజిట్ డబ్బులు సైతం వెనక్కి రాలేదని, ఆ నగదు వెనక్కి ఇప్పించాలని కోరుతూ సరంగడోలువారివీధికి చెందిన బి.జగన్నాథం, ఆదిత్యనగర్‌కు చెందిన డి.గౌరి, ఎ.కోమలి, బలగకు చెందిన ఎ.హేమలతతో పాటు పెద్ద సంఖ్యలో బాధితులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ● వరం కాలనీలోని సత్యసాయినగర్‌లో సీసీ కాలువలు, రహదారులు, వ్యక్తిగత కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ కాలనీకి చెందిన జి.సంజీవరావు తెలియజేశారు. ● శ్రీకాకుళం నగరంలోని బైరివానిపేట వద్ద నాగావళి ఒడ్డున ఉన్న శ్మశాన వాటిక రహదారి ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని, అక్కడ రోడ్డుతో శ్మశాన వాటిక ప్రహరీ, షెడ్డు నిర్మించాలని స్థానికులు ఖగేష్, అప్పారావు తదితరులు కోరారు. ● మొండేటి వీధి, దమ్మల వీధిలో పలు చోట్ల కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు రహదారులపై నిలిచిపోతోందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతి పత్రం అందించారు.

జయ శుభకారిణి... విజయ రూపిణి

శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా ఆయా చోట్ల మంటపాలలో, దేవాలయాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి కుంకుమ, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిని వివిధ స్తోత్రాలతో స్తుతించారు. – న్యూస్‌టుడే బృందం



మొండేటివీధిలో లలితాదేవి అలంకరణలో అమ్మవారు



రామలక్ష్మణ కూడలి వద్ద దుర్గామహాలక్ష్మి ఆలయంలో..



పొందూరు: పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం




పుణ్యపువీధిలో మహిళల సామూహిక కుంకుమ పూజలు



ఏడు రోడ్ల కూడలి వద్ద పూజలందుకున్న కనకదుర్గాదేవి



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో అమ్మవారి విగ్రహం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు











ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

ఆమదాలవలస గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో రోణంకి వెంకటరావు అన్నారు. శుక్రవారం ఆమదాలవలస ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం నుంచి ఆమదాలవలసకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ విస్తరణ అధికారిగా ఎ.గోపాలరావు బాధ్యతలు చేపట్టారు. వార్డు సచివాలయాల ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ, కార్యదర్శులు నాగరాజు, హరీష్‌లతో పాటు కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రోణంకి వెంకటరావు

SRI VENKATESWARA COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
(Approved by AICTE, New Delhi; Affiliated to JNTUGV, Vizianagaram)
NH-16, ETCHERLA - 532 410, SRIKAKULAM (Dist), Andhra Pradesh.
Email:principal_svcet@yahoo.com, Website: www.svcet.net, Contact No:9705576693

AP ICET-2024 SPOT & CAT-B (MQ) ADMISSION NOTIFICATION

For direct admission into MBA 1st Year under Spot & Category-B Few vacancies are available in first year, MBA under Spot & Category-B are to be filled by the college as per the rules. **MBA (HR & Finance).**
Last date for receipt of applications: **07/10/2024.**
Interested candidates may register their names at college office in person with all original certificates. Admissions will be made as per the guidelines of **APSCHE.**
Note: Fee reimbursement of Govt. of AP is not applicable.
For more details, please contact: **8897182605, 9440535787.**
PRINCIPAL

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయినటువంటి అర్జి రామారావు S/o లేటు యర్రయ్య, R/A D. No. 4-1-42, పెద్దరెల్లి వీధి రామమందిరం దగ్గర, పాలకొండ రోడ్, శ్రీకాకుళం జిల్లా వారి తరుపున ఇచ్చినటువంటి బహిరంగ ప్రకటన.

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయినటువంటి అర్జి రామారావు గారు మాడుగుల ముత్యాలమ్మ W/o లేటు రామారావు వగైరాలపై ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, శ్రీకాకుళం కోర్టులో OS 174/2024 డిక్లరేషన్ మరియు పెర్మనెంట్ ఇంజంక్షన్ దావా వేసియున్నారు. ఆ దావా పెండింగులో యున్నది. ప్రతివాదులు పై విషయములు ఏమీ తెలియపరచకుండా తప్పుడు దస్తావేజులు సృష్టించి దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్మజూపడానికి ప్రయత్నం చేయుచున్నారని మా క్లయింటుకు తెలిసినది. ప్రతివాదులు అమ్మజూపిన మరియు ఏ ఇతర ఆసాములు కొన్నను, తనఖా పట్టినను నా క్లయింటుపై చట్టరీత్యా చెల్లనేరవనియూ మరియు బంధించవనియు, కొన్నవారు శిక్షార్హులనియు ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు వివరములు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం టౌన్ పెద్ద రెల్లివీధి, బలగ వార్డు, న్యూ సర్వే నెం. 1015 ఖాళీ స్థలంనకు హద్దులు:

తూర్పు: దనాల లక్ష్మి గారి ఇల్లు, దక్షిణ: 10 అడుగుల రోడ్డు
పడమర: జలగడుగుల రాములమ్మ గారి ఇల్లు, ఉత్తర: దనాల చిన్నబాబుగారి ఇల్లు


తేది: 04-10-2024, శ్రీకాకుళం.
పొలిశెట్టి మురళీకృష్ణ
అడ్వకేట్, న్యూకాలనీ, శ్రీకాకుళం. సెల్: 80740 11482

వృత్తి విద్యతో భవిష్యత్తుకు బాటలు

పొందూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు అందిస్తున్న వృత్తి విద్య భవిష్యత్తుకు బాటలు వేస్తుందని బాలికల సంరక్షణాధికారిణి నీరజ, వృత్తి విద్య జిల్లా సమన్వయకర్త బి.తిరుపతిరావు అన్నారు. మండలంలోని వావిలిపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, తదితర వృత్తి కోర్సుల శిక్షణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హెచ్.ప్రభాకర్, ఒకేషనల్ శిక్షకులు కె.మంగమ్మ, ఎస్.మాలతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అందిస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న బాలికల సంరక్షణాధికారిణి నీరజ





(c) eenadu